క్లుప్తంగా

సచివాలయ పర్యవేక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు

ఆలమూరు: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నిరవధిక సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామ సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. గర్భిణి, బాలింతలు, చిన్నారులకు వీలైనంత మేరకు గ్రామ వలంటీర్లతో కలసి వారు సేవలను అందిస్తున్నారు. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, తహసీల్దార్ ఐపీ శెట్టి, సీడీపీఓ కె.శారద తదితరులు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. అంగన్‌వాడీల సమ్మె ప్రభావం లబ్ధిదారుల మీద పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందని వారు పేర్కొన్నారు.

వాణిజ్య విభాగాన్ని బలోపేతం చేయాలి


మోహన్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మొగలికుదురుకు చెందిన తేతల మోహన్‌రెడ్డికి శనివారం నగరంలో ఎమ్మెల్యే చిట్టిబాబు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ప్రజల్లో విశేష ఆదరణ ఉందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచించారు. మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ తదితరులు మోహన్‌రెడ్డిని అభినందించారు.

ఘనంగా పడి పూజ


కేశవదాసుపాలెంలో నిర్వహిస్తున్న పడి పూజ

సఖినేటిపల్లి: భవానీ మాలధారుల ఆధ్వర్యంలో కేశవదాసుపాలెంలో మారెమ్మ ఆలయం వద్ద శనివారం భవానీల 18 కలశాల పడిపూజ ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజలు, అభిషేకం కోసం భవానీలు నిర్మాణం చేసిన మండపం ఎంతగానో ఆకట్టుకుంది. మంగళంపల్లి గద శాస్త్రి ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భజనా కార్యక్రమం, అన్నప్రసాద వితరణ జరిగింది.

పేదల సంక్షేమానికి పీఎం మోదీ కృషి

పి.గన్నవరం: దేశంలో పేద ప్రజల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ అన్ని విధాలా కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం మండలంలోని వై.కొత్తపల్లిలో ఎంపీడీఓ భారతి పర్యవేక్షణలో సర్పంచ్ తోరం వీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేమా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వేమా వివరించారు. బీజేపీ నాయకులు చీకరమెల్లి శ్రీనివాస్, నాయకులు తిక్కా సత్యనారాయణ, అడ్డాల వెంకటేశ్వరరావు, కొల్లి సూర్యారావు, చెల్లింగి త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయులకు టోఫెల్‌పై అవగాహన

రాజోలు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన టోఫెల్ ఎడ్యుకేషన్‌పై ఆంగ్ల ఉపాధ్యాయులకు శనివారం రాజోలులో అవగాహన కల్పించారు. డీఈఓ ఎం.కమలకుమారి ఆదేశాల మేరకు జిల్లాలోని 22 మండలాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులకు అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, రావులపాలెం, రామచంద్రాపురంలలో నోడల్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారని ఎంఈఓ నల్లి మనోహరం తెలిపారు. రాజోలులో టోఫెల్ అవగాహన సదస్సును డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు ప్రారంభించారు. రాష్ట్ర రిసోర్స్‌పర్సన్స్ ఒ.జగపతి, ఆర్.వెంకటేశ్వరరావులు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

మిషన్ ఇంద్ర ధనస్సు

ఆలమూరు: చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ప్రభుత్వం మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని చేపట్టిందని కొత్తపేట అడిషనల్ డీఎంహెచ్ఓ ఎం.సుమలత అన్నారు. జిల్లా వైద్యారోగ్య ఆదేశాల మేరకు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలోని పినపళ్ల, జొన్నాడ, గుమ్మిలేరు గ్రామాల్లో వైద్యారోగ్య శనివారం చిన్నారులకు ప్రత్యేక టీకాల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, ఆర్.మల్లికార్జున్, డి.సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాల్లో వైద్యారోగ్య సిబ్బంది వలస కార్మికులు, గ్రామాంతరం వెళ్లిన తల్లిదండ్రుల చిన్నారులకు ఈ టీకాలను అందజేశారు. ఈ టీకాల ప్రక్రియను సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెచ్ఈలు బి.సూర్యనారాయణ ఏవీవీ రాజా అక్కుల పర్యవేక్షించారు. సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి వేళాయె..

- షష్ఠి ఉత్సవాలకు శ్రీకారం
- నేడు స్వామి వారి కల్యాణం





రాజోలు: జగతిలో ఉన్న ప్రతి అణువులో శివతత్వం ఉందని మానవులకు, పశుపక్ష్యాదులకు పరమతత్వాన్ని కడలి కపోతేశ్వర క్షేత్రం ప్రబోధిస్తుందని బ్రహ్మాండ పురాణంలో గౌతమీ మహత్యంలో వివరించారు. ఎంతో పురాణ ప్రసిద్ధి గాంచిన కడలి కపోతేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదీ ఆదివారం నుంచి షష్ఠి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 17వ తేదీ రాత్రి 7.15 గంటలకు వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణంతో షష్ఠి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. 18వ తేదీ సోమవారం స్వామి వారి తీర్థం, మధ్యాహ్నం మూడు గంటలకు సర్పవాహనంపై స్వామి వారి గ్రామోత్సవం, 19 మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు స్వామి వారికి పవళింపు సేవ నిర్వహిస్తారు. స్వామి వారి దర్శనం, షష్ఠి తీర్థంలో పాల్గొనే భక్తులకు సౌకర్యాలు, మెడికల్ క్యాంప్, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై ఈఓ సత్యనారాయణరాజు, రాజోలు సీఐ గోవిందరాజు ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు.

ఆలయ విశిష్టత:
క్రీ.శ. 15, 16 శతాబ్దంలో పల్లవులు కపోతేశ్వరాలయాన్ని నిర్మించారని నాగరలిపిలో రాసి ఉన్న శాసన ఆధారం ఉంది. రెండు కపోతాలు, ఒక వేటగాడు ప్రాణత్యాగానికి ప్రతీకగా శివుడు ఈ ప్రాంతంలో వెలసినట్టు పురాణగాథ. బోయవాడు స్వామికి సాష్టాంగ నమస్కారం చేస్తున్నట్టుగా శిలారూపం ఉంది. కపోతం అంటే పావురం. ఈ క్షేత్రంలో పావురాల జంట రూపంలో స్వయంభూ శివలింగం వెలసింది. ఆ శివలింగంపై కపోతాల రెక్కల ఆకృతి స్పష్టంగా దర్శనమిస్తోంది. ఈ క్షేత్రంలో సుబ్రహ్మణ్య స్వామి నాగేంద్రుని రూపంలో ఇలవేల్పుగా కొలువుదీరడంతో శివలింగంతో పాటు నాగేంద్రుడు కూడా నిత్య పూజలు అందుకుంటున్నారు. ఆలయానికి అనుకుని ఉన్న కొలను కపోతగుండంగా ప్రసిద్ధి చెందింది. కాశీలోని గంగాజలం ఈ గుండంలోకి అంతర్వాహినిగా ప్రవహిస్తోందని భక్తుల విశ్వాసం. స్వామి వారిని దర్శించుకుని పూజలు చేస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ప్రతి మాఘమాసం ఆదివారం నాడు కాశీ నుంచి గంగాజలం అంతర్వాహినిగా వచ్చి కపోతగుండంలో కలవడంతో ఆ రోజు మారేడు పత్రాలు ఆ గుండంలో(చెరువు) వేస్తే మునిగిపోతాయని అర్చకులు వివరిస్తున్నారు. ఆ రోజున కపోత గుండంలో స్నానమాచరించి కపోతేశ్వరుని దర్శిస్తే మోక్షం కలుగుతుందని భక్తులు విశ్వాసం. సుబ్రహ్మణ్యం స్వామికి ప్రతి మంగళవారం నిర్వహించే అభిషేకాల్లో సుమారు 150 మందికి పైగా పాల్గొంటారు. వీరికి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నప్రసాదం అందిస్తారు.

శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరీ దేవి దర్శనం
జగద్గురువులు ఆది శంకరాచార్యులు భారతదేశ పాదయాత్ర చేస్తూ అష్టోత్తర శ్రీచక్ర సహిత అమ్మవార్ల ఆలయాలను 108 చోట్ల ప్రతిష్ఠ చేశారు. స్వామి వారి ఆలయానికి ఎడమవైపు శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ అమ్మవారికి నిత్య కుంకుమపూజలు విశేషంగా నిర్వహిస్తారు.

క్షేత్ర పాలకుడు జనార్దనుడు
కపోతేశ్వరస్వామి ఆలయానికి క్షేత్ర పాలకుడుగా జనార్దనస్వామి ఉన్నారు. ఈ ఆలయ ప్రాంగణంలో వినాయకుడు, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, కుమారస్వామి, కనకదుర్గాదేవి, నవగ్రహాలు, కాలభైరవ స్వామి, శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరీదేవి, చండీశ్వరుడు, లింగాకారంలో సూర్యనారాయణ మూర్తి, పార్వతీదేవి, శ్రీ, భూ సమేత సత్యనారాయణస్వామి, సువర్చల సహిత ఆంజనేయస్వామి వారి ఉపాలయాల్లో కొలువుదీరారు.

సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం

రాజోలు/అయినవిల్లి: సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమైందని మండల పార్టీ అధ్యక్షుడు, సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అన్నారు. శనివారం సోంపల్లి గ్రామ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మూడు రోడ్ల కూడలిలో పార్టీ పతాకాన్ని సర్పంచ్ శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అయినవిల్లి మండల పార్టీ అధ్యక్షుడు కుడిపూడి విద్యాసాగర్ అధ్వర్యంలో అయినవిల్లి సచివాలయం-2లో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- పలివెలలో గడప గడపకూ..


పలివెలలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని పలివెలలో శనివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంట్లో సభ్యులకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వారికి వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. తొలుత పలివెల వంతెన వద్ద ఆ గ్రామానికి చెందిన ఎంపీపీ మార్గన గంగాధరరావు ఆధ్వర్యంలో జగ్గిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. అక్కడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ సీఎం వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు, ఇళ్ల పట్టాలు పంపిణీ
గ్రామ శివారు పెదపేట, చౌదరిపురం గ్రామస్తులు 63 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పంపిణీ చేశారు. కోటమెరకలో సీసీ డ్రైన్‌కు రూ.5 లక్షలు, రజకపేట డ్రైన్‌కు రూ.6 లక్షలు, అరుంధతీయపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల షెడ్డుకు రూ.2 లక్షలు, గ్రావెల్ రోడ్డుకు రూ.3 లక్షలు, పెదపేటలో రోడ్డు, విద్యుత్ స్తంభాలకు సచివాలయం-2 నిధులు రూ.10 లక్షలు, కోటమెరక ఆంజనేయస్వామివారి ఆలయం అభివృద్ధికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేస్తూ, పలు పనులకు జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. పలుచోట్ల జరిగిన సభల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే పరమావధిగా ఏర్పడిన పార్టీ వైఎస్సార్ సీపీ అని, దానికనుగుణంగా సీఎం జగన్ నాలుగున్నరేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. అందుకే ధైర్యంగా మేము గడప గడపకు వెళ్లి మా ప్రభుత్వం చేకూర్చిన పథకాలు బుక్‌లెట్ ఇచ్చి, ఇంకా సమస్యలేమైనా ఉంటే తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, స్థానిక ఎంపీటీసీ గునిపే శ్యామల, పీఏసీఎస్ అధ్యక్షుడు పొనుగుపాటి సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు తులా సూరిబాబు, దేవస్థానం చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, ధర్మసత్రం చైర్మన్ చప్పిడి సాయిబాబా, సర్పంచ్‌లు నెల్లి లక్ష్మీపతిరావు, రెడ్డి చంటి తదితరులు పాల్గొన్నారు.

కన్స్యూమర్ పెట్రోల్ పంపుల అనుమతులపై నిరసన

రాజోలు: కన్స్యూమర్ పెట్రోల్ పంపులకు చట్టవిరుద్ధంగా అనుమతులివ్వడంపై జిల్లా పెట్రోలియం డీలర్ల సంఘం నిరసన వ్యక్తం చేసింది. శనివారం రాజోలు రోటరీ భవనంలో జిల్లా పెట్రోలియం డీలర్ల సంఘ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ పాల్గొని ప్రసంగించారు. చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న కన్స్యూమర్ పెట్రోల్ బంక్‌లను తక్షణమే నిలిపివేయాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ఏపీకి వస్తున్న డీజిల్, పెట్రోల్, నాఫ్తాల్ ఆయిల్ అక్రమ రవాణా అరికట్టాలని కోరారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయాలు


నల్లచెరువులో పూజలందుకుంటున్న పద్మావతి, ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులోని కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికీ భక్తులు పోటెత్తారు.

ఆలమూరులో..
ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు.

సచివాలయాలతో విప్లవాత్మక మార్పులు


పెదపట్నంలంకలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో పెదపట్నంలంకలో నిర్మించిన సచివాలయం-1 భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామ స్థాయిలోనే ప్రజలకు అన్ని సేవలు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలన్నీ వారి ఇంటి వద్దనే వలంటీర్లు అందిస్తున్నారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ సుందరనీడి చిన్ని, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ నేతలు కొమ్ముల సూరిబాబు, జోగి రామకృష్ణ, రాయుడు జనార్దన్ పాల్గొన్నారు.

జగన్‌కు మరోసారి అండగా నిలుద్దాం


లక్కవరంలో పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: సంక్షేమ పాలన కోసం రాష్ట్ర ప్రజలంతా మరోసారి జగన్‌కు అండగా నిలవాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలోని లక్కవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం జగన్ అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతున్నారని అన్నారు. గత ప్రభుత్వాలకు, ఈ ప్రభుత్వం పనితీరుకు ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, సచివాలయ అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, మంగెన సింహాద్రి, సుంకర బాబ్జి, చింతా రాజబాబు, ముదునూరి విష్ణుమూర్తిరాజు, గున్నపురెడ్డి సుమలత, యెనుముల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత కలిగిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీదే..


పొన్నమండలో తాగునీటి నిర్మాణ పనులు ప్రారంభించిన ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే రాపాక

రాజోలు: సామాజిక బాధ్యత పెంపొందించే విధంగా రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని అమలాపురం ఎంపీ చింతా అనురాధ అన్నారు. శనివారం వేగివారిపాలెం, కడలి, కాట్రేనిపాడు గ్రామాల్లో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి పనులు ప్రారంభంలో ఎంపీ అనురాధ పాల్గొన్నారు. కాట్రేనిపాడులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు, వేగివారిపాలెంలో రూ.33 లక్షలతో ఎస్సీ కాలనీలో రక్షిత తాగునీటి ట్యాంకు నిర్మాణ పనులు, పొన్నమండలో రూ.33 లక్షలతో కందికట్ల వారి గ్రూపులో నిర్మించనున్న రక్షిత తాగునీటి ట్యాంకు నిర్మాణ పనులను ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులు ప్రారంభించారు. సమావేశంలో ఎంపీ అనురాధ మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమం, అభివృద్ధి పనులు ఏకధాటిగా చేపట్టారన్నారు. ఈ ప్రాంతంలో ఓఎన్జీసీ సంస్థ సామాజిక బాధ్యతగా తాగునీటి సౌకర్యాలకు నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ రాబోయే వేసవిలో ఎలాంటి తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా తీరప్రాంతం, ఉప్పునీటి ప్రాంతాల్లో రక్షిత తాగునీరు అందిచేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్‌లు కుక్కల బేబికుమారి, పప్పొప్పుల వెంకటలక్ష్మి, ఏఎంసీ వైస్‌చైర్మన్ సుంకర బాబ్జి, పార్టీ నాయకులు యెనుముల నారాయణస్వామి, కంచర్ల శేఖర్, అడబాల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

పేదల సేవకు యువత ముందుకు రావాలి

కొత్తపేట: ఇండియన్ రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థల స్ఫూర్తితో యువత ముందుకు వచ్చి గ్రామాల్లో పేదలకు సేవాకార్యక్రమాలు అందించాలని తహసీల్దార్ జీడీ కిశోర్‌బాబు సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ నారాయణ సరఫరా చేసిన టార్పాలిన్, హైజినిక్ కిట్లను శనివారం స్థానిక పెదగూళ్లపాలెంలో పూరిగుడిసె నివాసితులకు తహసీల్దార్ కిషోర్‌బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు సత్తిరాజు ఆదిత్యకిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ కంఠంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేద పారాయణ

ఆత్రేయపురం: గ్రామంలో నిర్వహించిన వేద పారాయణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. టీటీడీ ఆదేశాలతో దినత్రయ పారాయణ స్థానిక రాజ రాజేశ్వరి ఆలయంలో జరిగింది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఉత్తరాధికారి గుళ్లపల్లి దత్తాత్రేయ ఘనపాఠీ ఆధ్వర్యంలో వేద పండితులు నాలుగు వేద పఠనాలను ఆలపించారు. లోక కళ్యాణం కోసం టీటీడీ ఈ ధర్మప్రచారాన్ని ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు.

ఈవీఎంల నిర్వహణపై అవగాహన

ఆలమూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లపై ప్రధాన రాజకీయ పార్టీలకు అవగాహన సదస్సు జరిగింది. వచ్చే ఏడాది జరగే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను ఉపయోగించే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ ఐపీ శెట్టి సూచించారు. ఈవీఎంలను ఏ విధంగా ఉపయోగించుకోవాలన్న విధానంపై ఈనెల 18 నుంచి 31 వరకూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలందరూ ఈ కార్యక్రమానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కొత్తపేటలో..
కొత్తపేట: ఈవీఎంల వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని స్థానిక ఆర్డీవో ఎం.ముక్కంటి సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారులకు, రాజకీయ పార్టీల నాయకులకు ఈవీఎంల వినియోగంపై అవగాహన నిర్వహించారు.

పాఠశాలల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్లు


కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో ఎగ్జిబిట్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొత్తపేట: ప్రాథమిక స్థాయి నుంచి సైన్స్‌పై అవగాహన పెంపొందించుకుని కొత్త ఆవిష్కరణలు రూపొందించడం ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత, యూపీ పాఠశాలల్లో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్స్ నిర్వహించారు. దానిలో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అల్లూరి గోపాలరాజు ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో టీచర్స్ ఎగ్జిబిట్స్, విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిబిట్స్, విద్యార్థుల గ్రూప్‌తో మొత్తం 60 ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలల స్థాయిలో జరిగిన ఎగ్జిబిషన్‌లో పై మూడు విభాగాల నుంచి ఒక్కో ఉత్తమ ఎగ్జిబిట్‌ను ఎంపిక చేసి ఈ నెల 19న స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగే మండల స్థాయి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారని సైన్స్ ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం తెలిపారు.

బోయి భీమన్నకు నివాళి


మామిడికుదురులో భీమన్నకు విద్యార్థుల నివాళి

మామిడికుదురు: మహాకవి, పద్మభూషణ్, డాక్టర్ బోయి భీమన్న 18వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. మామిడికుదురులోని బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో ఉన్న విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమన్న సేవలను కొనియాడారు. భీమన్న కవిగా, ప్రజా ప్రతినిధిగా కళా రంగానికి, సాహిత్య రంగానికి విశేషమైన సేవలందించారని గెయిల్ నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ ఎ.సురేష్ కొనియాడారు. కార్యక్రమంలో గెయిల్ సంస్థలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

సఖినేటిపల్లి: మిచాంగ్ తుపాను కారణంగా దెబ్బతిన్న వరి నారుమడి రైతులకు ఎనభై శాతం రాయితీపై వరి విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. ఉయ్యూరి వారి మెరక గ్రామానికి చెందిన రైతులకు స్థానిక ఆర్బీకే వద్ద విత్తనాలను ఎంపీపీ వీరా మల్లిబాబు, ఉపాధ్యక్షుడు రుద్రరాజు చినరాజా అందజేశారు. ఎంపీపీ మల్లిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం తుపాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటుందన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో నష్టం అంచనాలు, పరిహారం పంపిణీ తదితర విషయాల్లో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తుందన్నారు. సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, మండల ఏఏబీ చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు, పీఏసీఎస్ చైర్మన్ కంతేటి వెంకట రామరాజు, ఏఈఓ రవీంద్రబాబు, వీఏఏలు రేణుక, సూర్య తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు బెంచీల ఏర్పాటు

మామిడికుదురు: కోనసీమ బ్లడ్ డోనర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నగరం దీవిలోని పలు ప్రాంతాల్లో శనివారం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. మామిడికుదురు, తాటిపాక, పాదలాడ, సోంపల్లి, శివకోడు లాకు వద్ద ప్రయాణికులు కూర్చునేందుకు అనువుగా సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తదానంతో పాటు అన్నదానం కూడా చేస్తున్నామని వీటితో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

విక్రమ్‌కు కవిబంధు పురస్కారం



మామిడికుదురు: పాశర్లపూడిలంకకు చెందిన కవి డాక్టర్ పాలమూరి విక్రమ్‌కు కవిబంధు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఆ సంస్థ కార్యదర్శి కె.బుచ్చేశ్వరరావు నుంచి తనకు ఈ మేరకు ఆహ్వానం అందిందని విక్రమ్ శనివారం తెలిపారు. సాహిత్య, సేవా రంగాల్లో చేస్తున్న కృషికి గాను తనను ఈ అవార్డుకు ఎంపిక చేశారని చెప్పారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగే సమావేశంలో ఈ పురస్కారం అందజేస్తారన్నారు. అవార్డుకు ఎంపికైన విక్రమ్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

అంగన్‌వాడీల తీరు విచారకరం

మలికిపురం: తమ సమస్యలపై కాకుండా సచివాల ఉద్యోగులలపై అసత్య వ్యాఖ్యలు చేయడానికే అంగన్‌వాడీ సిబ్బంది సమయం కేటాయిస్తున్నారని గ్రామ, సచివాలయ ఉద్యోగ సంఘ రాజోలు నియోజకవర్గ కన్వీనర్ ఎం.నూకాలరావు పేర్కొన్నారు. శనివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీల సమ్మె కారణంగా గర్భిణులకు, చిన్నారులకు ఆహార కొరత లేకుండా ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు అంగన్‌వాడీ సెంటర్లకు వెళ్లారని అంగన్‌వాడీలు గుర్తించాలని సూచించారు. విపక్షాల ఉచ్చులో పడి తమ సమస్యలపై కాకుండా ఎవరో మెప్పుకోసం పోరాడవద్దని ఆయన సూచించారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు


సీఎం జగన్‌ని కలసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న మహేశ్వరరావు తదితరులు

కొత్తపేట: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 26 డివిజన్లకు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) పోస్టు లు మంజూరు చేస్తూ జీఓ జారీ చేయడంపై ఆంధ్రప్ర దేశ్ పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీపీఆర్ఈఏ) సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞత లు తెలియజేసింది. ఆ మేరకు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం జగన్‌ని కలిసినట్టు కొత్తపేట ఎంపీడీఓ, రాష్ట్ర అసోసియేషన్ సభ్యుడు ఈ.మహేశ్వరరావు తెలిపారు. సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాలకి చేరాలని, తమకు సూచించినట్టు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో తనతో పాటు ఏపీఎన్జీఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్రామిరెడ్డి, కడప ఎంపీడీఓ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు సీఎంను కలిసినట్టు తెలిపారు.